# కానరాని పరిశీలన బృందాల జాడ

## పట్టించుకోని అధికారులు ఉపాధి పనులపై లేని నిఘా

న్యూస్‌టుడే-సీతంపేట: క్షేత్రస్థాయిలో అవకతవకలను గుర్తించి నివారించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపాలని నెల కిందట ప్రభుత్వం నిర్ణయించింది. గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకుని ఆదేశాలపై డ్వామా యంత్రాంగం రంగంలోకి దిగింది. అన్ని మండలాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల పర్యవేక్షణలో మండలస్థాయి అధికారులకు మస్టర్ల తనిఖీ బాధ్యతలు అప్పగించారు. ఈ ఆదేశాలు కంటితుడుపుగా కాగితాలకే పరిమితమయ్యాయి. పనుల వద్ద పరిశీలన బృందాల జాడ కానరావడం లేదు.

జిల్లాలో ఉపాధిహామీ పథకం డొల్లతనాన్ని సామాజిక తనిఖీ బృందాలు బట్టబయలు చేశాయి. రూ.కోటి వరకు మండలాల్లో సాగిన అక్రమాలను సోషల్ ఆడిట్ లో గుర్తించడంతో నిధుల రికవరీ, క్రిమినల్ చర్యలకు ఉపక్రమించారు. కలెక్టర్ ఆదేశాలపై ఇప్పటికే సగం మండలాల్లో ఎమ్పీడీవోలు క్రిమినల్ చర్యలకు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. వాస్తవానికి రెట్టింపు స్థాయిలో భారీగా అక్రమాలు సాగినప్పటికీ క్షేత్రస్థాయి సిబ్బంది, చోటా నేతలు ముందుగా అప్రమత్తమై అక్రమాలను కప్పిపుచ్చే యత్నాలు తెరవెనుక చేయడంతో చాలాచోట్ల అవకతవకలు వెలుగులోకి రానివిషయం నిర్వివాదాంశం. ఈ తరుణంలో ప్రస్తుతం వినియోగిస్తున్న సిబ్బంది పనుల పరిశీలనకు సరిపోనందున మండలస్థాయి అధికారులు, వివిధ శాఖల సిబ్బంది సహకారం తీసుకోవాలని గ్రామీణాభివృద్ధి శాఖ సంచాలకులు ఆదేశించారు. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులతో గత నెలలో కలెక్టర్ సమావేశం నిర్వహించి పంచాయతీల వారీగా బృందాల నియామకంపై ఆదేశాలిచ్చారు. మండలాల్లో ఎమ్పీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా విభాగం అధికారులతో మోనటరింగ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. పంచాయతీల వారీగా కార్యదర్శులు, వి.ఆర్.ఒ.లను రంగంలోకి దింపారు. గ్రామాల్లో ఏపని జరిగినా మస్టర్లను తనిఖీచేసి వీరు సంతకం చేయాలి. స్టాంపు వేసి ఇచ్చిన మస్టర్లను మండల కేంద్రాల్లోని కంప్యూటర్ విభాగాలు వేతనాల చెల్లింపునకు వీలుగా ఆమోదించాలి. మండల స్థాయి అధికారులు విధిగా వారంలో కనీసం నాలుగు పనులైనా పరిశీలించాలి. ఎక్కడా ఈ దిశగా చొరవ కానరావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. వంద రోజుల పని దినాలు కల్పించడం, ప్రభుత్వం ఆదేశించిన విధంగా పూర్తిస్థాయిలో వేతనాలు చేరేలా లబ్ధిదారులకు పనులపై అవగాహన కల్పించడం, కరవు పరిస్థితుల దృష్ట్యా వలసలు నివారించడం వంటి కీలక విధులకు అందరూ దూరంగా ఉన్నారు. ఇప్పటికే తమపై ఉన్న విధుల ఒత్తిడిని వీరు గుర్తుచేస్తున్నారు.



ఎటువంటి పరిశీలన లేకుండా జరుగుతున్న పనులు



మొగదారలో ఈ చెరువుకే రూ.14.83 లక్షలు వెచ్చింపు

### రూ.250 కోట్లతో పనులు

జిల్లాలో ఈ ఏడాది రూ.250 కోట్లతో పనులు చేపట్టారు. ఇప్పటికే రూ.109 కోట్లు వ్యయం చూపిస్తున్నారు. వాస్తవానికి 34,396 పనులను రూ.672 కోట్లతో గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేసింది. 35 మండలాల్లో వివిధ దశల్లో 13,778 పనులు ఉన్నాయి. కేవలం 27,155 కుటుంబాలకే గత నెల 30 నాటికి వంద రోజుల పని దినాలు కల్పించారు. తనిఖీ బృందాల జాడ లేకపోవడంతో ఏజెన్సీ గ్రామాల్లో పనుల్లో నాణ్యత, మస్టర్లపై పరిశీలన కానరావడం లేదు. ఇటీవల మొగదారలో చేపడుతున్న చెరువు పనుల్లో పనులకు రాకుండానే తొమ్మిది మంది పేర్లను నమోదు చేయడం బయటపడింది. కార్యదర్శులు, వి.ఆర్.ఒ.లకు ఇప్పటికే అన్ని పనులూ చూడాలని ఆదేశించినట్లు ఎ.పి.డి. ఎల్.రామారావు తెలిపారు. అక్రమాలు జరిగితే క్షేత్ర సహాయకులు, మేట్లపై క్రిమినల్ చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.